క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం

• రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి



ధ్రువ పత్రాలను అందించిన డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడొచ్చని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మణిదీపిక గార్డెన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలువాలని పిలుపు నిచ్చారు. రక్తం సరైన సమయంలో దొరకక ఎంతో మంది అభాగ్యులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్యం కూడా మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్, నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, శంకర్‌పల్లి సీఐ వినాయక రెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, డిటెక్టివ్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న పంటల సాగు మేలు

• వ్యవసాయ శాస్త్రవేత్త నరేందర్‌రెడ్డి



విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు చేస్తే రైతులకు అన్ని విధాలుగా మేలు కలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి అన్నారు. కళాశాల నిర్వాహకులు దత్తత తీసుకున్న మండలంలోని మల్లాపూర్ గ్రామంలో శుక్రవారం పలువురు శాస్త్రవేత్తలు రైతులకు ఉచితంగా కుసుమ పంట విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా సాంప్రదాయ పంటలను కాకుండా మార్కెట్లో అధికంగా డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే పంటల సాగులో లాభాలు గడించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కృష్ణ, రమేశ్, పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గిరాయిగుట్ట తండా వాసులు బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని గిరాయిగుట్ట తండాకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత వంకాయల నారాయణరెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేశ్, శివ, రమేశ్, కుమార్, సంతోశ్, కిషన్, విష్ణు, శ్రీను, మోహన్, వెంకటేశ్, చందు, మురళీ, వెంకటేశ్, రాములు, యాదయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో అన్ని ఏర్పాట్లు చేయండి

• ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ సాయిరాం



అధికారుల సమావేశంలో ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఎన్నికల సెక్టోరల్ అధికారులకు చేవెళ్ల ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు, సౌకర్యాలపై సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 23 మంది సెక్టోరల్ అధికారులు వారివారి పరిధిలలో పోలింగ్‌బూత్ ఏర్పాట్లను పరిశీలించుకోవాలని చెప్పారు. ఆయా బూత్‌లలో కరెంట్ కనెక్షన్‌లు, నీటి వసతులు, బాత్‌రూమ్‌లు సక్రమంగా ఉన్నాయా? లేదా? చూసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల తహసీల్దార్‌లు, 23 మంది సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దుర్గామాత పూజలు



గాంధీనగర్ కాలనీలో సరస్వతిదేవీ రూపంలో



ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మొయినాబాద్‌రూరల్: నక్కలపల్లిలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు



షాద్‌నగర్: అన్నదానం ప్రారంభిస్తున్న కొందూటి నరేందర్

చేవెళ్ల: నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం చేవెళ్లలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీలో ఊరేగించారు. ఆలయంలో మహిళలు బతుకమ్మ ఆడారు. చేవెళ్ల మండలకేంద్రంలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ప్రత్యేకక పూజలు చేశారు.

మొయినాబాద్‌రూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నక్కలపల్లి గ్రామంలో 15 మంది దంపతులు శుక్రవారం హోమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న అంజయ్యాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, ఎం మల్లేశ్, బి నర్సింహులు, సిహెచ్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా అమ్మవారు

షాద్‌నగర్: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గాంధీనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి, శ్రీ శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం, బైపాస్‌లోని యమ్మి హోటల్ సమీపంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో, ఎలికట్టలోని అంబభవానీ దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించారు.



కొత్తూరు: పూజలు చేస్తున్న నాయకులు

భక్తి భావం పెంపొందించుకోవాలి..

ప్రతీఒక్కరు భక్తి భావం పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 15వ వార్డులో ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చలి నర్సింహ్మా, సాధిక్, శంకర్, లింగం, రామలింగ, హరిహరన్, జశ్వంత్, విగ్నేష్, చింటు, నవీన్, బన్నీ, మనోజ్, యాదగిరి, నాని, రాజు, వంశీ, కాలనీ వాసులు శంకరమ్మ, విజయలక్ష్మీ, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శ్రీఅంబాభవానీమాత దేవాలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి, పల్లకీసేవ, హోమంవంటి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపం వద్ద కుంకుమ అర్చన, అన్నదానం నిర్వహించారు.

అసైన్‌మెంట్ భూములపై స్పష్టత కరువు



మాట్లాడుతున్న ఉప్పరి శ్రీనివాస్

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి కేసీఆర్ అసైన్‌మెంట్ భూములపై స్పష్టమైన నిర్ణయం వెల్లడించలేదని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ అన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం అసైన్‌మెంట్ భూముల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైన్‌మెంట్ భూములపై అందరికీ హక్కు ఇవ్వాలని, కేవలం దళితులకు అనడం సరికాదన్నారు. బీసీ సామాజిక కులాలకే ఎక్కువ అసైన్‌మెంట్ భూములు ఉన్నాయన్నారు. రెండోస్థానంలో దళితులు ఉన్నారని, అసైన్‌మెంట్ భూములను ప్రజాప్రతినిధులు లాక్కుంటున్నారని వాటిని వెనక్కి తిరిగివ్వాలన్నారు. ముఖ్యమంత్రి ఆలోచించి అన్ని కులాల వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో మొయినాబాద్ మండల అధ్యక్షుడు మాల రాజు, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు ఐలేష్, కంజర్ల కిషన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంజయ్యయాదవ్‌ను గెలిపించుకుందాం

కేశంపేట: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను మళ్లీ గెలిపించుకోవాలని మండల బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్‌కి చెందిన వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దోహదపడిన ఎమ్మెల్యేను మళ్లీ గెలింపిచుకొని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గెలుపును అడ్డుకోలేరన్నారు. ఎన్నికల్లో ప్రజలే స్వచ్ఛందంగా మళ్లీ ఎమ్మెల్యేగా అంజయ్యయాదవ్‌ను గెలిపించుకుంటారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, తలసాని వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, కృష్ణయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అంగన్‌వాడీల అభివృద్ధికి తోడ్పాటు

• యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్



బాకారం అంగన్‌వాడీ కేంద్రంలో బీరువా అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందజేస్తున్నారని, దాతలు వాటి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, బాకారం ఉపసర్పంచ్ ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాకారం గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు బీరువాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలకు, బాలింతలకు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బాకారంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉపాధ్యాయులకు రోజు వారి రికార్డులు భద్రపరచుకునేందుకుగాను బీరువాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నిర్మల, వనజ, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు, బుజంగం ముదిరాజ్, కిరణ్‌కుమార్, దయాకర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించండి

షాద్‌నగర్: ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బూర్గుల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలను శుక్రవారం శ్రీను నాయక్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ వస్తున్నా కూలీలు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని ఆయన వాపోయారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

• ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

శంకర్‌పల్లి: ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లిలోని ఎస్‌ఎం గార్డెన్‌లో శంకర్‌పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, ప్రజల సొత్తును పూర్తిగా దోచుకొని లక్షల కోట్లకు వారి కుటుంబాలు ఎదిగాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని పథకాల పేరుతో వేల కోట్ల కుంబకోణాలు జరిగాయాని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, మైసయ్య, మోహన్, కాశీనాథ్‌గౌడ్, బానూరి కృష్ణ, కృష్ణారెడ్డి, తోషిక్, రాజుగౌడ్, యాదిరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీంభరత్

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి



మద్యం స్వాధీనం చేసుకున్న సీఐ అంజనీకుమార్

షాద్‌నగర్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ దుకాణదారుడు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని ఎక్సైజ్ సీఐ అంజన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ అంజన్‌కుమార్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఈ నెల 9నుంచి అక్రమ మద్యం, అక్రమంగా కల్లు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులను నిర్వహిస్తామన్నారు. ఈ దాడులలో నియోజకవర్గంలో ఇప్పటి వరకు 28 కేసులను నమోదు చేశామన్నారు. 160లీటర్ల లిక్కర్, 165 లీటర్ల బీరు, 925 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ప్రతీరోజు బార్‌షాపులు, బెల్టు షాపులలో తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం, బీరు, కల్లు నిల్వ చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం

షాద్‌నగర్‌రూరల్: బాల్యమిత్రుడు అకాల మరణం చెందడంతో తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన కృష్ణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతని ఆటో ప్రమాదానికి గురై కాలికి గాయమైంది. దీంతో కృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఖరీదైన వైద్యం చేయించుకోలేకపోయాడు. సకాలంలో మెరుగైన వైద్యం అందకపోవడంతో కృష్ణ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తమవంతు సహాయంగా రూ.77వేలు అందజేశారు.

